క్లుప్తంగా

పంచాయతీల్లో పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి, ఎల్లూర్, అగర్‌గూడ గ్రామపంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను శనివారం ఎంపీడీవో రమేశ్ పరిశీలించారు. పంచాయతీల్లోని నర్సరీలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, చంద్రయ్య, కిష్టయ్య గ్రామస్తులు ఉన్నారు.

'పఠనంతో విజ్ఞానం పెరుగుతుంది'

తిర్యాణి: పఠనంతోనే విద్యార్థుల విజ్ఞానం పెరుగుతుందని జెడ్పీ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజయ్య అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ పాఠశాలలో రూమ్ టూ రీడ్ సంస్థ, రూపొందించిన లిట్రసీ క్లౌడ్ వైబ్‌సైట్‌ను ఉపయోగించి పిల్లలకు పఠన కృత్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో రూమ్ టూ రీడ్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీనివాస చారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

సిర్పూర్(టి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాల్లో ఒకటైన ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యుత్ ఏఈ ఇర్ఫాన్ అన్నారు. శనివారం సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో ఇంటింటా తిరిగి ఆరు గ్యారంటీల దరఖాస్తుదారుల పత్రాలను పరిశీలించి వివరాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులు తమ ఆరు గ్యారంటీల దరఖాస్తు రశీదుతో పాటు గృహజ్యోతి పథకానికి కావాల్సిన ధ్రువపత్రాలను అందించాలని సూచించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ గద్దల మల్లేశ్, నాజీఫ్ అహ్మద్, సిబ్బంది ఉన్నారు.

కార్మికుల సమ్మె విజయవంతం చేయండి

తిర్యాణి: సమాన పనికి సమాన వేతనం, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త కార్మిక సమ్మెతో పాటు భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ లుపునిచ్చారు. సంబంధిత వాల్ పోస్టర్లను శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సింగం మోగిలి గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి రంగు లచ్చగౌడ్ తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

కౌటాల: మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి ఎస్సై ఎస్. మధుకర్, ఎస్ఆర్ఎస్ యూత్ సభ్యులు శనివారం నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందించారు. యూత్ సంఘం అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్, సభ్యులు వెంకటేశ్, పురుషోత్తం, విలాస్, విజయ్, పుండలిక్ తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న కుమ్ర భగవంత్‌రావు

జైనూర్: ఇటీవల జైనూర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన అంజయ్యను మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు శనివారం ఘనంగా సన్మానించారు. సీఐ అంజయ్య మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు తన వంతు కృషి చేస్తానన్నారు. గంగాధర్ తదితరులు ఉన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్సైలు

వాంకిడి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్సైలు సాగర్, తేజశ్విని కేవీపీఎస్ డైరీని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ డైరీలో మహనీయుల జీవిత చరిత్రలు, ఉపయోగకరమైన చట్టాలు, రిజర్వేషన్లను పొందుపర్చడం గొప్ప విషయమన్నారు. కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్, హెడ్ కానిస్టేబుల్ గణేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భయం వీడితేనే జయం

- మోటివేషనల్ స్పీకర్లు ఆచార్య, వరుణ్
- 'పది' విద్యార్థులకు ప్రేరణ తరగతులు



ప్రేరణలో మాట్లాడుతున్న స్పీకర్ శ్రీనివాస ఆచార్య

కౌటాల: ప్రతీ విద్యార్థి జీవితంలో పదో తరగతి భవిష్యత్‌కు పునాది వంటిదని, భయం వీడి పరీక్షలకు హాజరైతే అనుకున్న ఫలితాలు సాధించవచ్చని మోటివేషనల్ స్పీకర్లు శ్రీనివాస ఆచార్య, వరుణ్ పేర్కొన్నారు. శనివారం వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కౌటాల జగదాంబ గార్డెన్స్‌లో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యంపై మాత్రమే దృష్టి సారించి సక్సెస్ సాధించాలని సూచించారు. ఎలా చదవాలి, ఎలా మార్కులు సాధించాలో వివరించారు. ఎంఈవో సోమయ్య మాట్లాడుతూ.. మండలంలో 350 మంది విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు. విద్యార్థులు చదువుకోవాలంటే ఉపాధ్యాయులే కాకుండా తల్లి దండ్రుల ప్రోత్సాహం కూడా అవసరమని తెలిపా రు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన పలు వురు విద్యార్థులు 'సాక్షి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

కష్టపడి చదువుతున్నాం



వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో సమయం వృథా కాకుండా కష్టపడి చదువుతున్నాం. ప్రతీ సబ్జెక్ట్‌కు తగిన సమయం వెచ్చిస్తున్నాం. అందరం ఒకేచోట కూర్చుని ఒకరి సందేహాన్ని ఒకరు నివృత్తి చేసుకుంటున్నాం. ప్రేరణ తరగతులు ఉపయోగకరంగా ఉన్నాయి.

– గాయత్రి, కేజీబీవీ, కౌటాల

భయం పోతోంది



పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మా సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. ముందుగా ప్రీఫైనల్ పరీక్షలకు సిద్ధమవుతున్నాం. 10జీపీఏ సాధించాలనే లక్ష్యంతో శ్రమిస్తున్నాం. ప్రేరణ తరగతుల ద్వారా కొంత భయం పోతోంది.

– శివకుమార్, జెడ్పీఎస్ఎస్, కౌటాల

ఉపయోగకరంగా..



ఇంతకుముందు పరీక్షలంటే భయం ఉండేది. కష్టమనుకుంటున్న లెక్కలు, ఇంగ్లిష్ సబ్జెక్టులు తేలిగ్గా అర్థం చేసుకోగలుగుతున్న. మోటివేషనల్ స్పీకర్లు చెప్పిన సూచనలు ఉపయోగకరంగా ఉన్నాయి. పాసవుతానో.. లేదో.. అన్న భయం ఉండేది. ఇప్పుడు గ్యారంటీగా పాసవుతానన్న నమ్మకం వచ్చింది.

– అమూల్య, కౌటాల

పట్టుదల ఉంటే విజయమే..



ఈ సారి 'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి. విద్యార్థులు పరీక్షల పైనే దృష్టి సారించాలి. ఏదైనా కష్టమనుకుంటే కష్టంగానే ఉంటుంది. తేలిక అనుకుంటే తేలికవుతుంది. పట్టుదలతో చదివితే ఏదీ కష్టం కాదు. చదువుపై ఆసక్తి పెంచుకోవాలి. ఇందుకు టీచర్లు, అధికారులు చొరవ చూపాలి.

– శ్రీనివాస ఆచార్య, స్పీకర్, హైదరాబాద్

ముందు భయం వీడాలి



పరీక్షలకు ముందుగా ఆందోళన, భయం వీడాలి. ప్రీఫైనల్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తే వార్షిక పరీక్షల్లో పూర్తిస్థాయి పట్టు సాధించవచ్చు. మానసికంగా దృఢంగా ఉండాలి. వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేలాది మంది పిల్లలకు అవగాహన కల్పించాం. విద్యార్థులపై శ్రద్ధ చూపాలి.

– వరుణ్, స్పీకర్, హైదరాబాద్

మెరుగైన ఫలితాలు సాధిస్తాం



పదో తరగతి వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. ఫలితాల్లో కౌటాల మండలాన్ని నంబర్‌వన్‌గా తేవాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నాం. అనుకున్న ప్రణాళికకు ఏదీ అడ్డంకి కావని అనుకుంటున్నాం. 'పది' విద్యార్థులకు నవంబర్ నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వార్షిక పరీక్షలో ఈసారి కచ్చితంగా మంచి ఫలితాలు సాధిస్తాం.

– సోమయ్య, ఎంఈవో, కౌటాల

మొక్కలు నాటేది ఎలా..?



ఎదులపహాడ్ నర్సరీలో జల్లెడ పట్టకుండా మట్టి నింపి ఉన్న బ్యాగులు

తిర్యాణి: రాష్ట్ర ప్రభుత్వం ఏటా హరితహారం కార్యక్రమం నిర్వహించేందుకు ప్రతీ గ్రామంలో నర్సరీలు ఏర్పాటు చేసింది. రూ.లక్షలు వెచ్చించి నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. మొక్కల పెంపకంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో 50శాతం మొక్కలు కూడా బతకడం లేదు. దీంతో పెద్ద ఎత్తున ప్రజాధనం వృథా అవుతోంది. నిబంధనల ప్రకారం మొక్కల కోసం ఎర్రమట్టి, ఎరువును జల్లెడ పట్టి బ్యాగుల్లో నింపాల్సి ఉండగా మండలంలోని గంభీరావుపేట, ఎదులపహాడ్ గ్రామాల్లోని నర్సరీల్లో నేరుగా గడ్డలు కట్టిన ఎర్రమట్టినే బ్యాగుల్లో నింపుతున్నారు. మరికొన్ని చోట్ల ఎరువులను సైతం వేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈవిషయంపై ఏపీఎం షాకీర్ ఉస్మానిని వివరణ కోరగా జల్లెడ పట్టకుండా మట్టిని బ్యాగుల్లో నింపినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. జల్లెడ పట్టించి బ్యాగుల్లో మట్టి నింపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీడీపీవో

లింగాపూర్: మండలంలోని లింగాపూర్, పిక్లాతండా, పిట్టగూడ, మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధి గోండుగూడ అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం సీడీపీవో ఇందిరమ్మ, సూపర్‌వైజర్ లైలా పరిశీలించారు. సీడీపీవో మాట్లాడుతూ చిన్నారులకు పోషకాహారం సక్రమంగా అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు ఆరోగ్యలక్ష్మి పథకాలపై వివరించాలని అంగన్‌వాడీ వర్కర్లకు సూచించారు.

జాతరలో అన్ని సౌకర్యాలు కల్పించాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న విశ్వ ప్రసాద్‌రావు, అజ్మీర శ్యాం నాయక్

రెబ్బెన: గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ రావు, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాం నాయక్‌లు అధికారులను కోరారు. శనివారం డీఎస్పీ వెంకటరమణతో కలిసి ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్న అనంతరం జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో జీఎం రవిప్రసాద్‌తో సమావేశమై సహకారం అందించాలని కోరారు. నాయకులు రమేశ్, దేవాజీ, సుదర్శన్‌గౌడ్, రాజేశ్, సోమయ్య, గంటుమేర, కిషన్‌గౌడ్, సురేందర్ రాజు పాల్గొన్నారు.

సీపీఎం పోరాట ఫలితమే టెండర్లు



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

ఆసిఫాబాద్: తమ పోరాట ఫలితంగానే ప్రభుత్వం తునికాకు టెండర్లు పిలిచిందని సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసిఫాబాద్ డివిజన్‌లోని మిగిలిన 10 యూనిట్లకు కూడా టెండర్లు పిలవాలని, లేకుంటే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు గొడిసెల కార్తీక్, ఆదివాసీ సంఘం నాయకులు కోట శ్రీనివాస్, కోరెంగ మాలాశ్రీ తదితరులు ఉన్నారు.

పని వేళలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏరియా జీఎం రవిప్రసాద్

రెబ్బెన: సంస్థ పురోభివృద్ధి కోసం ఉద్యోగులు, అధికారులు తమ పని వేళలతో పాటు సమయాన్ని, యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం రవి ప్రసాద్ అన్నారు. శనివారం ఏరియాలోని కైరిగూడలో మల్టీ డిపార్టుమెంట్ కమిటీ అధికారులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం రవిప్రసాద్ మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా యంత్రాలను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణ, ఉద్యోగులు, యంత్రాల పనితీరు గణాంకాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్వోటూ జీఎం ఉమాకాంత్, ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, ఏజీఎం తిర్మల్‌రావు, డీజీఎం ఉజ్వల్‌కుమార్‌బెహారా, పర్సనల్ మేనేజర్ తిరుపతిలు పాల్గొన్నారు.

గుట్టలు తవ్వుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి


కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చారిగాం శివారులో గల గుట్టలను తవ్వుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు చింతగూడ గ్రామానికి చెందిన జాడి దీపక్ వినతిపత్రం అందజేశారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా గుట్టలను తవ్వుతున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎడారి ఓడల సందడి



రెబ్బెన: ఎడారి ప్రాంతాల్లో మాత్రమే కనిపించే ఒంటెలు మండలంలో దర్శనమిచ్చాయి. రాజస్థాన్‌కు చెందిన మేకల కాపరులు ఒంటెలు, మేకలతో శనివారం మండల కేంద్రం మీదుగా వెళ్తుండగా 'సాక్షి' పలకరించింది. జీవనోపాధి, పశువులకు మేత కోసం రాజస్థాన్ నుంచి ప్రతీ సంవత్సరం శీతాకాలంలో ఇక్కడికి వస్తుంటామని తెలిపారు. ఒంటెలను చూసి చిన్నారులు కేరింతలు కొట్టారు.

కేజీబీవీల్లో ప్యానల్ టీం పర్యవేక్షణ



బెజ్జూర్ కేజీబీవీలో పర్యవేక్షిస్తున్న టీం సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని కేజీబీవీల్లోని పాఠశాల విద్యా ప్రమాణాలపై ప్యానల్ టీం పర్యవేక్షిస్తున్నట్లు ఎస్‌వో సుభాశ్ తెలిపారు. శనివారం జిల్లాలోని పలు కేజీబీవీల్లో పర్యవేక్షన టీంలు పరిశీలించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని కేజీబీవీలను పర్యవేక్షించేందుకు 9 మందితో ఒక టీం ఏర్పడి, సభ్యుల్లో ప్రతీ సబ్జెక్టు ఉపాధ్యాయుడు, టీం లీడర్‌గా హెచ్‌ఎం ఉంటారన్నారు.

మహిమల స్వామి 'వెంకన్న'



అనార్‌పల్లిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం



గర్భగుడిలోని ప్రతిమలు

- నేటి నుంచి అనార్‌పల్లిలో బ్రహ్మోత్సవాలు
- ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తుల రాక
- టీటీడీ నుంచి హాజరు కానున్న ధర్మాచారులు

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి గ్రామంలో నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే జాతరను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేశారు. ఉమ్మడి జిల్లాతోపాటు కరీంనగర్, వరంగల్, ఖమ్మం, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారి దర్శనం చేసుకుంటారు. ఆలయంలో ప్రతిష్ఠించిన వేంకటేశ్వర స్వామి, లక్ష్మీపద్మావతి, లక్ష్మీవినాయకుడు, గరుడ, కుర్మ, ఆంజనేయ స్వామి దేవతామూర్తులకు నిత్యం గ్రామస్తులు పూజలు చేస్తుంటారు.

టీటీడీ నుంచి..

విరాళాలు సేకరించి 1988లో ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఏటా స్వామి వారి పేరిట జాతర, బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు టీటీడీ నుంచి అసాం ఏడుకొండలు, దామోదరా ధర్మాచారులు రానున్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పసుపు కుంకుమ, అక్షింతలు, ప్రసాదం సమర్పించనున్నారు.

ఇవీ కార్యక్రమాలు..

నేడు ఉదయం 5.45 గంటలకు స్వామివారికి అలంకరణ, మగ్‌బీచ్ చంద్ర దర్శనం, 6.30 గంటలకు స్వామి వారి అభిషేకం, 8 గంటలకు ధ్వజారోహణ, 9.10గంటలకు లక్ష్మీపద్మావతి, శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం, 11.15 గంటలకు పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం, మధ్యాహ్నం 3.30 గంటలకు స్వామి వారి రథం ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ కార్యదర్శి జాదవ్ కిష్టు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా 11న కబడ్డీ, 12న క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు.

స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న రాజేందర్

రెబ్బెన: దేశంలోని స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్న బహిరంగ సభను జిల్లాలోని కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పెరిక శ్రీకాంత్, రాజేశ్వరి, మండల కన్వీనర్ చంద్రకళ, ప్రమీల, బాలమ్మ, సుబ్బలక్ష్మి, సంతోషి, తార, పద్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం



ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాలేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి పురస్కరించుకొని నవరాత్రి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు అర్చకులు శ్రీధర్ శర్మ, అజయ్ శర్మ, విజయ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం గోపూజ, నదీపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలేశ్వర స్వామికి ఏకవార రుద్రాభిషేకం చేశారు. అనంతరం పలువురు దంపతులు సామూహికంగా లక్ష్మీగణపతి హోమం చేశారు. అర్చకులు శ్రీధర్ శర్మ మాట్లాడుతూ రథసప్తమి వేడుకల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



మాట్లాడుతున్న డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని డీటీడీవో రమాదేవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంగ్లిష్ సామర్థ్యాల పెంపునకు అమలువుతున్న 100 రోజుల కార్యక్రమం తప్పకుండా అమలు చేయాలన్నారు. ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, స్కూల్ కాంప్లెక్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఎస్పీఎంలో ఎన్నికలు నిర్వహించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్పీఎంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బాలభారతి పాఠశాలలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ట్రేడ్ యూనియన్ నాయకులు, వివిధ పార్టీల నాయకులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ జేకే యాజమాన్యం కార్మికుల శ్రమ దోపిడికి పాల్పడుతుందన్నారు. ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు జయదేవ్, ఉపాధ్యక్షులు నర్సయ్య, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, ట్రేడ్ యూనియన్ నాయకులు అంబాల ఓదెలు, వెంకటేశం, ముంజం ఆనంద్, కలికోట రమణయ్య, సీనియర్ న్యాయవాది రజీహైదర్, కిషోర్, ఆదివాసీ జిల్లా నాయకులు సోయం చిన్నయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న పాన్‌షాపు యజమాని

కాగజ్‌నగర్‌రూరల్: దహెగాం మండలం బీబ్రా గ్రామానికి చెందిన దాసరి ఉదయ్ కిరణ్ శుక్రవారం రాత్రి నగదుతో కూడిన పర్సును కాగజ్‌నగర్‌లో పోగొట్టుకున్నారు. లారీచౌరస్తా వద్ద గల పాన్ షాపు యజమాని కోట దాసుకు పర్సు దొరకడంతో శనివారం పట్టణ పోలీసులకు అప్పగించారు. పర్సులో రూ.11వేలతోపాటు ఆధార్ కార్డు, క్రెడిట్ కార్డు ఉండటంతో పోలీసులకు అప్పగించినట్లు దాసు తెలిపారు. శనివారం పట్టణ సీఐ శంకరయ్య, ఎస్సై అంజయ్య సమక్షంలో బాధితుడికి పర్సు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న కోట దాసును పోలీసులు అభినందించారు.